క్లుప్తంగా

ఉమెన్స్ కళాశాలకు హాస్టల్ అనుమతి ఇప్పించాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు అనుబంధంగా హాస్టల్ అనుమతి ఇప్పించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం కొత్తగూడెంలో సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కాలేజీకి అనుబంధంగా హాస్టల్ అనుమతి లభిస్తే విద్యార్థినులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఇందుకు సానుకూల పరిస్థితులు ఉన్నందున స్పందించాలని కోరారు. అలాగే, సింగరేణిలో ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లో హైకోర్టు తీర్పు ప్రకారం మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

బాధ్యతలు చేపట్టిన జీఎం పర్సనల్


బీఆర్ దీక్షితులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం)గా బీఆర్ దీక్షితులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన బొద్దు హనుమంతరావు ఉద్యోగ విరమణ చేయటంతో ఆయన స్థానంలో దీక్షితులుకు యాజమాన్యం అదనపు బాధ్యతలు అప్పగించింది. జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ నాపై ఉన్న నమ్మకంతో తనకు నాలుగు శాఖల అధిపతిగా బాధ్యతలను అప్పగించినందుకు తాను ఎంతో గర్వపడుతున్నానని, అంకితభావంతో పనిచేస్తూ, కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

కృష్ణారెడ్డికి నివాళి


నివాళులర్పిస్తున్న గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్: ఇల్లెందు పీఏసీఎస్ తొలి అధ్యక్షుడు కృష్ణారెడ్డికి మాజీ ఎమ్మెల్యే నేత గుమ్మడి నర్సయ్య, నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ప్రజా ఉద్యమాలకు అండగా నిలిచిన కృష్ణారెడ్డి రైతాంగ సమస్యలను పరిష్కరించడలో ముందుండే వారని గుర్తుచేశారు. అవుల కిరణ్, నాయిని రాజు, బుర్ర వెంకన్న, అజ్మీర బిచ్చా పాల్గొన్నారు.

'నీట్'లో రాణించారు..


అఖిల్

టేకులపల్లి: ప్రభుత్వం ప్రకటించిన నీట్ ఫలితాల్లో టేకులపల్లికి చెందిన పలువురు విద్యార్థులు రాణించారు. బేతంపూడి పంచాయతీ వెంకట్యాతండాకు చెందిన వీఆర్‌ఓ ఆంగోతు నందు, ఏఎన్‌ఎం.లక్ష్మి దంపతుల రెండో కుమారుడు అఖిల్ నీట్‌లో ప్రతిభను కనబరిచి 472 మార్కులు సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. టేకులపల్లికి చెందిన గ్రామీణ వైద్యుడు జెట్టి పెంటయ్య రెండో కుమార్తె జె.పి.పావని 455 మార్కులు సాధించినట్లు తండ్రి తెలిపారు.

సమష్టి ఉద్యమాలతోనే మహిళలకు రక్షణ


జెండా ఎగురవేస్తున్న లక్ష్మీకుమారి

సింగరేణి(కొత్తగూడెం): సమష్టి ఉద్యమాలతోనే మహిళలకు రక్షణ, మహిళా చట్టాలు హక్కులకు పరిరక్షణ అని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి అన్నారు. సీపీఐ అనుబంధ భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్‌డబ్ల్యూ) 70వ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో ఉత్సవాలు నిర్వహించారు. తొలుత సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో మొట్టమొదటిగా పురుడుపోసుకున్న మహిళా సమాఖ్య నాటి నుంచి నేటి వరకు అలుపెరగని పోరాటాలు చేస్తోందన్నారు. మహిళా హక్కుల పరిరక్షణ, చట్టాల అమలు కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన చరిత్ర ఉందని, మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా.. స్పందిస్తూ న్యాయం జరిగే వరకు అండగా నిలుస్తుందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అసమానతలను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మామిడాల ధనలక్ష్మి, కరీష రత్నకుమారి, మందా నిర్మల, మేదిని లక్ష్మి, దార్ల లక్ష్మి, ఎస్‌కే సాహీన్, పుట్ట భాగ్యలక్ష్మి, ఎం.అనసూర్య, ఎం.విజయలక్ష్మి, ఎస్‌కే షమీమ్, కే.నాగమణి, బి.శాంతి, ప్రమీల, సమ్మక్క, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పొడి దుక్కుల్లో విత్తనాలు వద్దు..

- తొందర పడొద్దని సూచిస్తున్న అధికారులు
- ఇప్పటికే రంగంలోకి దిగిన అన్నదాతలు
- మండలంలో 26,250 ఎకరాల్లో సాగు అంచనా
- పత్తి, వరి సాగుకే ప్రాధాన్యత


పొడి దుక్కిలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

పాల్వంచరూరల్: పొడిదుక్కుల్లో విత్తనాలు విత్తొద్దు అని వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా కొందరు రైతులు ముందుకే సాగుతున్నారు. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో అన్నదాతలు వానాకాలం వ్యవసాయసాగు పనులు మొదలుపెట్టారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే భూముల్లో ఎండవేడి ఇంకా పూర్తిగా తగ్గకున్నా రైతులు మాత్రం విత్తనాలు విత్తుతున్నారు. పాల్వంచ మండలంలో ఈ వానాకాలం 26,250 ఎకరాల్లో వివిధ ఫంటలు సాగుచేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేశారు. ఇందులో పత్తి 15వేల ఎకరాల్లో, వరి 10వేల ఎకరాలు, మొక్కజొన్న వెయ్యి ఎకరాల్లో, 250 ఎకరాల్లో మిర్చి పంటలను సాగు చేయనున్నట్లు లెక్కలు వేశారు.

ఎండవేడి తగ్గలేదు...

రోహిణి కార్తె ప్రారంభం నుంచి ఎండలు దంచికొడుతున్నా తరుణంలో ఎక్కువ శాతం మంది రైతులు వివిధ పంటలు సాగు చేసేందుకు భూముల్లో దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. భూముల్లో తేమ లేకుండా విత్తనాలు విత్తవద్దని, విత్తితే ఎండలకు మెలకెత్తకుండా పోతాయని.. తద్వారా రైతులకు నష్టం వాటిల్లుతుందని ఒకవైపు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా రైతులు అనేక గ్రామాల్లో చదును చేసిన దుక్కుల్లో అప్పుడే పత్తి విత్తనాలను విత్తడం మొదలుపెట్టారు.

పెరగనున్న పత్తిసాగు విస్తీర్ణం...

ఈ ఏడాది పత్తిసాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. గతేడాది 13వేల ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగు చేసిన రైతులకు తీవ్రనష్టం వాటిల్లినా... సాగు చేసిన రైతులకు మంచి దిగుబడి రావడంతో పాటు మద్దతు ధర దక్కింది. గతేడాది ఫలితాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి పత్తి సాగుకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. దీంతో మరో రెండువేల ఎకరాల విస్తీర్ణంలో పత్తిసాగు అధికంగా సాగయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. కాగా, కిన్నెరసాని రిజర్వాయర్ నీటితో పాల్వంచ మండలంతోపాటు బూర్గంపాహాడ్ మండలంలో 10వేల ఎకరాల భూముల్లో వరి సాగు కానుంది. కిన్నెరసాని ఎడమ కాలవ కింద ఏడువేల ఎకరాలు, కుడికాలవ కింద మూడువేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తారు. ఈసారి అధిక వర్షాలు కురిస్తే రిజర్వాయర్ రెండు కాలువల ద్వారా పంటలకు సాగునీరు అందే అవకాశం ఉంది. రిజర్వాయర్ నీటిమట్టం 407 అడుగులు కాగా 406 అడుగుల వరకు నీటిమట్టం చేరితే రెండు కాలువల ద్వారా పంటలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. జూలై, ఆగస్టు నాటికి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండినా వానాకాలం పంటల సాగుకు ఇబ్బంది ఉండదని రైతులు ధీమాతో ఉన్నారు. రైతులు మెట్ట దుక్కులు దున్ని వరినాట్లు వేసేందుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.


దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

విత్తనాల ఎంపికలో తొందరపడొద్దు...

ఆరుగాలం శ్రమించినా ఫలితం దక్కాలంటే అన్నదాత ఆది నుంచే అప్రమత్తంగా ఉండాలి. దుక్కి దున్నింది మొదలు పంట చేతికొచ్చే వరకు సాగుకు అన్ని జాగ్రత్తలు పాటించాలి. ప్రస్తుత సీజన్‌లో రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. విత్తన సంస్థలు పెద్దఎత్తున చేసే ప్రచారానికి ఆకర్షితులై తక్కువ ధరలకు వస్తున్నాయని విత్తనాలను కొనుగోలు చేయవద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి మోసపోవద్దని, ఏ విత్తనం కొనుగోలు చేసినా లైసెన్స్ పొందిన వ్యాపారుల నుంచి బిల్లులు తీసుకుని పంట దిగుబడి చేతికి వచ్చే వరకు జాగ్రత్తగా ఉంచుకోవాలి. విత్తన ప్యాకెట్లను కూడా భద్రపరుచుకోవాలి.

రెండు ఎకరాల్లో పత్తి విత్తాను...



ఈ ఏడాది వానాకాలంలో రెండు ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నా. అడపాదడపా కురిసిన వర్షాలకు దుక్కులు దున్ని పత్తి విత్తనాలను విత్తాను. రోహిణి కార్తెలో విత్తనం విత్తడం వలన పంట దిగుబడి వస్తుందని ముందుగానే పత్తి విత్తనాలను విత్తాను.
– శ్రీను, రైతు, నర్సంపేట

దిగుబడి రాలేదు..



గతేడాది పత్తి సాగు చేస్తే ఆశించిన దిగుబడి రాక అప్పులు అయ్యాయి. గతేడాది చేసిన అప్పులు పూడ్చుకోవడానికి ఈసారి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో పత్తిసాగు చేయాలని నిర్ణయించుకుని ముందుగానే పత్తి విత్తనాలను విత్తడం జరిగింది.
– యానాల రామకృష్ణారెడ్డి, రెడ్డిగూడెం

వర్షాలు కురిశాకే విత్తాలి..



వేసవి వేడి తగ్గక ముందు వట్టి దుక్కులో విత్తనాలు విత్తొద్దు. తొలకరి వానలు కురిసిన తర్వాత తేమ శాతం సరిపడా ఉన్నప్పుడే భూముల్లో విత్తనాలను విత్తుకోవాలి. విత్తనాలు సేకరించే ముందు రైతులు జాగ్రత్తలు పాటిస్తే పంట దిగుబడులు పెరిగే అవకాశాలు ఉంటాయి. – భోజీ శంకర్, ఏఓ

అసెంబ్లీ ఓట్లను మించి ఆధిక్యం

- కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌కు ఆధిక్యత
- డీలా పడిన బీఆర్ఎస్ అభ్యర్థి కవిత

ఇల్లెందు: నిన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పోలిస్తే ఎంపీ ఎన్నికల ఫలితాలు రికార్డులను తిరగరాశాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ఇల్లెందు నియోజకవర్గంలో అసెంబ్లీ, ఎంపీ ఎన్నికలను పరిశీలిస్తే భారీ వ్యత్యాసం నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్యకు సుమారు 56 వేల మెజార్టీ లభించింది. బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియకు సుమారు 51 వేల ఓట్లు వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో బలరాం నాయక్‌కు ఇల్లెందు నియోజకవర్గం నుంచి 92,957 ఓట్లు రావడం విశేషం. ఇందులో సుమారు 60 వేల మెజార్టీ నమోదు కాగా, కనకయ్య కంటే మూడు వేల పైచిలుకు మెజార్టీ ఎక్కువగా ఉంది. ఇక హరిప్రియకు అసెంబ్లీ ఎన్నికల్లో 51 వేల ఓట్లు రాగా, ఇప్పుడు కవితకు 33,658 ఓట్లే వచ్చాయి.

2019 ఎంపీ ఎన్నికల్లో... 2019లో జరిగిన ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత 1,46,562 ఓట్ల మెజార్టీ సాధించారు. ఆనాడు కాంగ్రెస్‌తో సమాన ఓట్లు వచ్చాయి. ఇల్లెందు నియోకవర్గంలో మాలోత్ కవితకు 53,307 ఓట్లు నమోదు కాగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కు 53,104 ఓట్లు నమోదయ్యాయి. ఇప్పుడు బలరాంనాయక్‌కు రెట్టింపు ఓట్లు రాగా, కవితకు గణనీయంగా పడిపోవడం గమనార్హం. కాగా, మహబూబాబాద్‌లో జరిగిన ఓట్ల లెక్కింపును ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఇల్లెందు నుంచి వివిధ పార్టీల నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, జానీపాషా, ఎస్.కే.జానీ, పింగళి నరేష్, డానియేల్, పులి సైదులు, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, మండల రాము, చిల్లా శ్రీనివాస్, గోచికొండ సత్యనారాయణ, గోచికొండ శ్రీదేవి, యదళ్లపల్లి అనసూర్య ఉన్నారు.

'గూడెం'లో కాంగ్రెస్‌కు 1,05,402 ఓట్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు భారీగా ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్–1,05,402, బీఆర్ఎస్–29,225, బీజేపీ–27,240 ఓట్లు పోలు కాగా కాంగ్రెస్‌కు 76,177 మెజార్టీ వచ్చింది. నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ–80,336, ఫార్వర్డ్‌బ్లాక్–53,789, బీఆర్ఎస్–37,555 ఓట్లు వచ్చాయి.

పాల్వంచ: ఖమ్మం ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయం పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కొత్వాల శ్రీనివాసరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, కాపా శ్రీను, పులి సత్యనారాయణ, వై.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, చాంద్‌పాషా, పైడిపల్లి మహేశ్, మాలోతు కోటి, ధర్మసోతు ఉపేందర్, దారా చిరంజీవి, శాంతివర్ధన్, రాము, శ్రీలతరెడ్డి, అరుణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంబురాలు జరుపుకుంటున్న నాయకులు

జూలూరుపాడు: కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయం సాధించడంతో మంగళవారం పడమటనర్సాపురంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు లేళ్ల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు..


విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న రంగాకిరణ్

పాల్వంచరూరల్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడం పట్ల మంగళవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయంలో నరేంద్రమోదీ మరోసారి ప్రధానమంత్రి కావాలని కోరుతూ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెరువు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు రాపాక రమేష్, కల్లోజు నాగరాజు, వంశీకుమార్, తాటికొండ కళ్యాణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దమ్మపేట, అంబేద్కర్, బస్టాండ్ సెంటర్లలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కె.వి.రంగాకిరణ్, నాయకులు ఆకుల నాగేశ్వరరావు, బైరి నిర్మల, శ్రీధర్, నాగేశ్వరరావు, వంశీ, ప్రశాంత్, లక్ష్మణ్, కిట్టు, కమురుద్దీన్, ఖయ్యూం పాల్గొన్నారు.

అనంతారంలో తాగునీటి అవస్థలు


ట్యాంకర్ నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

జూలూరుపాడు: మండలంలోని అనంతారం గ్రామ ప్రజలు తాగునీటి సమస్యతో అవస్థలు పడుతున్నారు. వారంరోజులుగా డీపీ మోటార్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ ట్యాంకు ఉన్నప్పటికీ ఒకటి, రెండు బిందెల నీళ్లు మాత్రమే వస్తున్నాయి. తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డీపీ మోటార్‌కు విద్యుత్ సరఫరా కల్పించడంలో విఫలమయ్యారు. మంగళవారం గ్రామ ప్రజలే గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్‌ను ఓ రైతుకు చెందిన ట్రాక్టర్ ఇంజన్‌తో వ్యవసాయ బోరు వద్దకు తరలించారు. నీళ్లు తెచ్చి ఇంటింటికీ సరఫరా చేసుకున్నారు.

ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ... పంచాయతీ సెక్రటరీ, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో పంచాయతీ వాటర్ ట్యాంకర్‌లో తామే నీళ్లు నింపుకొని పట్టుకుంటున్నామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీపీ మోటార్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో పర్యావరణ విభాగం ఆధ్వర్యాన బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం కార్యాలయంలో ప్రత్యేక వేదికను ఇప్పటికే సిద్ధం చేశారు. ఈ ఏడాది 'నేల పునరుద్ధరణ – ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి' అంశాన్ని ఎంచుకున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, సంస్థ ఆధ్వర్యన ఇప్పటి వరకు 5 కోట్ల మొక్కలను నాటగా, ప్రభావిత గ్రామాల్లో 2.25 కోట్ల మొక్కలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఇక వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు 435 ఇంకుడు గుంతలు నిర్మించామని, 234.5 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అంతేకాక విద్యుత్ పొదుపు చేసే పరికరాల వాడకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు.

సెల్ టవర్ పనుల అడ్డగింత

జూలూరుపాడు: నివాసాల మధ్య సెల్ టవర్ నిర్మించరాదంటూ సురారం గ్రామానికి చెందిన గ్రామస్తులు మంగళవారం పనులను అడ్డుకున్నారు. సురారం గ్రామంలో ఓ ప్రముఖ కంపెనీకి చెందిన సెల్ టవర్ నిర్మించేందుకు జేసీబీతో పనులు చేపట్టారు. గ్రామస్తులు వెళ్లి టవర్ నిర్మించడానికి వీలులేదంటూ ఆందోళన చేపట్టారు. బాధితులు మాట్లాడుతూ... నివాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తే రేడియేషన్ కారణంగా అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని, ఊరికి దూరంగా నిర్మించుకోవాలన్నారు. ఇళ్ల మధ్య సెల్ టవర్ నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయడం జరిగిందని గ్రామస్తులు చెప్పారు.

సెల్ టవర్ పనులు ఆపే వరకు ఇక్కడ నుంచి కదలమని పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఒప్పుకోలేదు. టవర్ పనులు నిలిపివేయడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

హరినాథ్‌రెడ్డి సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంటౌన్: సీనియర్ క్రీడాకారుడు బి.హరినాథ్ మరణం తీరని లోటు అని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రముఖ క్రీడాకారుడు కార్యదర్శి బి.హరనాథ్‌రెడ్డి సంతాప సభకు ఎమ్మెల్యే హాజరై నివాళులర్పించారు. మాట్లాడుతూ.. జిల్లాలో వాలీబాల్, అథ్లెటిక్స్, టెన్నిస్, హాకీ వంటి క్రీడలను జాతీయ, రాష్ట్ర, జిల్లా పోటీలను నిర్వహించి క్రీడల అభివృద్ధికి ఎనలేని కృషిని చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.మహీధర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఈ.మొగిలి, కోశాధికారి రాసపల్లి రాజేంద్రప్రసాద్, బాక్సింగ్ సెక్రటరీ ఎం.రమేష్, జిల్లా యోగా సెక్రటరీ గుమలాపురం సత్యనారాయణ, బరిగెల భూపేష్, జాన్సన్ సుధాకర్, బి.రఘులతో పాటు పలువురు పాల్గొన్నారు.

నాగప్రసాద్‌కు నివాళి..

పాల్వంచ: పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన సీపీఐ నాయకుడు తాటికొండ నాగప్రసాద్ (34) మృతి పట్ల ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు.

మంగళవారం ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబాన్ని ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, సుధాకర్, అన్నారపు వెంకటేశ్వర్లు, కోటి నాగేశ్వరరావు, లాల్ పాషా, జకరయ్య, రమేశ్, కాసర్ల రామారావు, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో సంబరాలు


ఇల్లెందు: సంబురాలు చేసుకుంటున్న తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు

ఇల్లెందు: ఏపీలో టీడీపీ ఘన విజయం సాధించటం పట్ల ఇల్లెందులో నాయకులు సంబరాలు నిర్వహించారు. మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ వంశీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జగదాంబా సెంటర్‌లో టపాసులు పేల్చి రంగులు చల్లుకుని స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చాందావత్ రమేష్‌బాబు, శ్యామ్, నర్సయ్య, లింగయ్య, బాబు, ఎల్లయ్య, శివ, నవీన్, శ్రీవేద్, వినీత్, నాగుల్, శ్యామ్, శ్రీకాంత్, పవన్, రాంగోపాల్, మదన్, కొండల్ రెడ్డి, జానీ, రవి పాల్గొన్నారు.

టేకులపల్లి: ఏపీ అసెంబ్లీలో టీడీపీ విజయం సాధించినందుకు టేకులపల్లిలో ఆ పార్టీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో టపాసులు పేల్చి, బైక్ ర్యాలీ నిర్వహించారు. రామాలయంలో ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద కొబ్బరి కాయలు కొట్టారు. ఈ కార్యక్రమంలో గుడిపూడి మోహన్‌రావు, మూడు రాజ్‌కుమార్, రాయల ప్రశాంత్, ముత్తినేని అనిల్, సాయి, రాజేష్, రవి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏపీలో పవన్ కళ్యాణ్ విజయం సాధించడం పట్ల టేకులపల్లిలో ఆయన అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. కార్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి సంబరాలు జరుపుకున్నారు. రావూరి సతీష్, బొడ్డు అశోక్, మోకాళ్ల సునీల్, మూడు పవన్, అంతోటి సతీష్, టింకు, మణి, అనుదీప్, అన్వేష్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రోడ్డు అధ్వానం


కొత్తగూడెం మున్సిపాలిటీలోని 16వ వార్డులో గుంతలు పడిన రోడ్డు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ పంచాయతీ రోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు రాకపోకలు కొనసాగించటం కష్టంగా మారింది. రెండేళ్లుగా ఇదే పరిస్థితులు వాహనచోదకులను, ప్రజలను వెంటాడుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణ పనులు త్వరగా చేపట్టాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అధికారులను ఆదేశించారు. అయినా అధికారులలో చలనం లేదు. కొత్తగూడెం మున్సిపాలిటీ 16వ వార్డులోని మురుగు నీరు, లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ పంచాయతీలోని తారు రోడ్డుపైకి వస్తుండటంతో, ఆ రోడ్డుపై గుంతలు పడి, వాటిలో మురుగు ఉంటోంది. ఈ రోడ్డు గుండా కొత్తగూడెం నుంచి గొల్లగూడెం, ఎదురుగడ్డ, హేమచంద్రాపురం, కారుకొండ, హోలీతండా మీదుగా బొమ్మనపల్లి క్రాస్‌రోడ్డు నుంచి ఇల్లెందు రోడ్డుకు భారీ వాహనాలు వెళ్తుంటాయి. అంతేకాకుండా ఇల్లెందు నుంచి బొమ్మనపల్లి మీదుగా కారుకొండ, హేమచంద్రాపురం, ఎదురుగడ్డ, గొల్లగూడెం, కొత్తగూడెం త్రీటౌన్ గుండా ఆటోలు, ట్రాలీలు, ద్విచక్ర వాహనలు, వ్యాన్‌లు, కారులు, జీపులు రాకపోకలు కొనసాగిస్తాయి. అంతేకాకుండా హోలీతండా, కారుకొండ, హేమచంద్రాపురం, జూబ్లీపురం, తదితర ప్రాంతాల నుంచి ప్రజలు, రైతులు ఏది కొనుగోలు చేయాల్సి వచ్చినా, మార్గం మధ్యలో ఉన్న ఎదురుగడ్డ పంచాయతీలోని చివరి భాగం, 16వ వార్డు ప్రారంభంలో ఉన్న గుంతలమయంగా మారిన రోడ్డు గుండా రాకపోకలు చేయాల్సి ఉంటుంది.


రూ.రెండు కోట్లు మంజూరు...

లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ పంచాయతీ తారు రోడ్డు మీదికి, కొత్తగూడెం మున్సిపాలిటీ 16వ వార్డులోని మురుగు రావటం వల్ల రోడ్డు గుంతలమయంగా మారింది. దీనిపై అప్పట్లో ఎదురుగడ్డ సర్పంచ్, కవిత, 16వ వార్డు మున్సిపాలిటీ కౌన్సిలర్ మాచర్ల రాజకుమారి, మధ్య వివాదం జరిగింది. ఈ విషయంలో రాజకుమారి భర్త మాచర్ల శ్రీనివాస్ మున్సిపాలిటీ అధికారులను పిలిపించటంతో, అధికారులు అక్కడికి వచ్చి చర్చించారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పాత పోలీసు స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ వరకు తారురోడ్డు, ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణానికి రూ.రెండు కోట్లు మంజూరు చేశారు.

రూ.కోట్లు ఖర్చు...


లక్ష్మీదేవిపల్లి బొమ్మనపల్లి క్రాస్ రోడ్డు నుంచి కారుకొండ బైపాస్ రోడ్డు వరకు రూ.కోట్లు ఖర్చు చేసి, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తారు రోడ్డు నిర్మించారు. ఎదరుగడ్డ పంచాయతీలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తారు రోడ్డు, బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు కానీ, కొత్తగూడెం పాత పోలీసు స్టేషన్ నుంచి కొత్త పోలీసు స్టేషన్ మీదుగా గొల్లగూడెం, ఎదురుగడ్డ వరకు నిర్మాణం చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని, కొత్తగూడెం మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఆందోళన చేపట్టారు. ఈ నిధులు ఆర్‌అండ్‌బీ శాఖకు అప్పగించారు. అయినా అధికారులు టెండర్ పిలువలేదు. రూ.మూడుకోట్లతో 1. 5 కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం చేయాల్సి ఉందని, ఏడు మీటర్లు రైల్వే స్థలం కోసం చర్చలు జరిగాయని, రెండో విడత చర్చలు జరిపించాలని ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి



కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి రోడ్డు, ఇరువైపుల డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి టెండర్ పిలవాలి. అధికారులు నిర్లక్ష్యం వీడి నిత్యం వందలాది వాహనాల రాకపోకలు కొనసాగించే ఈ రోడ్డును అభివృద్ధి చేయాలి. – మాచర్ల శ్రీనివాస్

ప్రమాదాలు జరుగుతున్నాయి..



16వ వార్డు చివరిలోని ఎదురుగడ్డ పంచాయతీ ప్రారంభంలో రోడ్డుపై గుంతలు పడి, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ నుంచి లక్ష్మీదేవిపల్లి మండలం ఎదురుగడ్డ వరకు రోడ్డు నిర్మించాలి. – నేరెళ్ల రమేష్